




కుడి కాలువలోకి సాగునీరు వెలుతున్న దృశ్యం

ఖరీఫ్‌పై చిగురించిన ఆశలు

- తోటపల్లి ద్వారా సాగునీరు విడుదల
- నారు మడులకు తొలగనున్న ఇబ్బందులు
- జిల్లా రైతాంగం ఆనందం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రస్తుతం వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. దీంతో నారు మడులకు ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం తోటపల్లి బ్యారేజీ నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సాగునీటిని విడుదల చేశారు. దీంతో ఖరీఫ్‌పై ఆశలు చిగురించాయి. కుడి ప్రధాన కాలువ ద్వారా జిల్లాలోని బొబ్బిలి, తెర్లాం, రాజాం, చీపురుపల్లి, గరివిడి మండలాలకు సాగునీరు అందనుంది. శనివారానికి గుర్ల మండల ప్రాంతానికి నీరు చేరుతుందని రైతులు భావిస్తున్నారు. పాత కాలువల పరిధిలో వంగర మండలానికి కూడా సాగునీరు చేరనుంది. దీంతో జిల్లా రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తుంది.



సాగునీరు విడుదలకు బటన్ నొక్కుతున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు జగదీశ్వరి, జయకృష్ణ

1.80 లక్షల ఎకరాలకు సాగునీరు..

తోటపల్లి ప్రాజెక్టు ద్వారా మొత్తం 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. నూతనంగా నిర్మించిన కుడి ప్రధాన కాలువ పరిధిలో 1,31,221 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో 13,684 ఎకరాలు మినహా మిగిలిన ఆయకట్టు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో విస్తరించి ఉంది. జిల్లా పరిధిలోని బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజవర్గ పరిధిలో 25,060 ఎకరాల ఆయకట్టు ఉంది. పెండింగ్‌లో ఉన్న గజపతినగరం బ్రాంచి కాలువ పనులు కూడా పూర్తి చేస్తే మరో 15వేల ఎకరాల ఆయకట్టు పెరగనుంది. తోటపల్లి ప్రధాన, బ్రాంచి కాలువలను ఆధునికీకరిస్తే ఆయకట్టు మరింతగా పెంచుకునేందుకు అవకాశం ఉంది. నాగావళి నదిలో నీరు ప్రవాహ సామర్థ్యం ఎక్కువగా ఉంది. దీంతో వేసవిలో సైతం తోటపల్లి బ్యారేజీలో నీటి లభ్యత ఉంటుంది. కొన్నిసార్లు విజయనగరం కార్పొరేషన్ ప్రజలకు తాగునీటిని అందిస్తున్న చంపావతి నది ఎండిపోతే తోటపల్లి నీటిని వినియోగిస్తుంటారు. తోటపల్లి నీరు చివరిగా గుర్ల మండలం గడిగెడ్డ రిజర్వాయరులో కలుస్తుంది. ఇక్కడి మిగులు జలాలు చంపావతికి చేరుతుంటాయి. ఇలా విజయనగరం ప్రజల దాహార్తిని తీర్చేందుకు కూడా అత్యవసర పరిస్థితిలో వినియోగ పడుతుంది.

లస్కర్ల సమస్య పరిష్కరించాలి..

తోటపల్లి సాగునీరు ప్రణాళికా బద్ధంగా రైతులకు చేరాలంటే లస్కర్ల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. వీరు క్షేత్ర స్థాయిలో వారబందీ ప్రాతిపదికన నీటిని విడుదల చేస్తూ నీరు వృథా కాకుండా చేసేందుకు వీలుంటుంది. కానీ, లస్కర్ల కొరత కారణంగా సాగునీరు అందించడంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. రిటైర్ అయిన లస్కర్ల స్థానంలో కొత్తవారిని నియమించడం లేదు. వైసీపీ ప్రభుత్వం గతేడాది తాత్కాలికంగా నియామకాలు చేపట్టింది. కానీ జీతాలు సక్రమంగా చెల్లించని కారణంగా వారు విధులకు దూరమయ్యారు. సీజనల్‌గా కాకుండా పూర్తి స్థాయిలో అవుట్ సోర్సింగ్ లేదా కాంట్రాక్ట్ విధానంలో తీసుకుని ఖరీఫ్, రబీ సీజన్లలో వీరి సేవలు పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. నీరు విడుదల లేని నెలల్లో కాలువల నిర్వాహణ బాధ్యతలను అప్పగించాలని కోరుతున్నారు.

శివారు ప్రాంతానికి సాగునీరు అందిస్తాం: మంత్రి

శివారు ప్రాంత భూములకూ సాగునీరందించాలనే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం. తోటపల్లి ప్రాజెక్టు నుంచి తాగు, సాగునీరందించేందుకు గతంలోనే ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కృషి చేశారు. అపర భగీరథునిగా ముందుకు సాగారు. తోటపల్లిని వరంగా ఇచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి. గతంలో బాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పోలవరం ప్రాజెక్టు 70 శాతం పనులు పూర్తి చేశారు. రాష్ట్రం అభివృద్ధి కోసం పెట్టుబడులు సాధించేందుకు సీఎం చంద్రబాబు అవసరమైన సన్నాహాలు చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. కాగా తోటపల్లి కుడి ప్రధాన కాలువ పరిధిలో సుమారు 1,31,221 ఎకరాలకు సాగునీరందేలా దృష్టి సారిస్తున్నామని' తెలిపారు. కార్యక్రమంలో మంత్రి కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు, నార్త్‌కోస్ట్ సీఈ శంబంగి సుగుణాకరరావు, ఎస్ఈ రాజరాజేశ్వరి, ఈఈలు రామచంద్రరావు, ఆర్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలి

- కలెక్టర్ అంబేడ్కర్



జిల్లా న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్, జూన్ 28: జిల్లాలో పలు ప్రాజెక్టుల కోసం జరుగుతున్న భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని, అదే విధంగా నిర్వాసితులకు చెల్లింపులు కూడా సత్వరమే జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో భోగాపురం ఎయిర్‌పోర్ట్, జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్, తదితర పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. భోగాపురం ఎయిర్ పోర్టు పనులకు సంబంధించి మ్యాప్‌ను పరి శీలించారు. రన్‌వే, అప్రోచ్ రోడ్డు పనులు పురోభివృద్ధిలో ఉన్నాయని, ఆర్అండ్ఆర్ సమస్యలు లేవని డిప్యూటీ కలెక్టర్లు వివరించారు. జాతీయ రహదారులకు సంబంధించి ప్యాకేజీ-1లో మ్యుటేషన్ సమస్యలు ఉన్నాయని, 3లో రోడ్‌పై విగ్రహాలు తొలిగించవల్సి ఉందని, చెల్లింపులు కొంత మేరకు పెండింగ్ ఉన్నాయని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. రైల్వే పనులకు భూసేకరణ చేపట్టాల్సి ఉందని, పెదమనాపురం వద్ద గ్రామ కంఠం కోసం నోటిఫికేషన్ జారీ చేయవల్సి ఉందని ఆర్డీవో సూర్యకళ తెలిపారు. అదే విధంగా పురిటిపెంట బాధితులకు చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, కోమటిపల్లి వద్ద భూసేకరణ చేయాల్సి ఉందని రైల్వే అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ కోసం నిధులు లేవని, పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పెండింగ్ వివరాలతో నోట్ సమర్పించాలని, ఇరిగేషన్ సెక్రటరీకు లేఖ రాస్తామని కలెక్టర్ తెలిపారు. తారకతీర్థ సాగర్, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు నిధులు లేక ఆగిపోయాయని, కొన్ని చోట్ల భూ సమస్యలు కూడా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి అధికారులు తెచ్చారు. రైతులతో మాట్లాడి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేసీ, ఆర్డీవోకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఆర్డీవోలు అనిత, సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు మురళీ, జోసెఫ్, జీఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన కలెక్టర్

జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణ చక్రవర్తిని శుక్రవారం కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని న్యాయాధికారి చాంబర్‌లో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు జిల్లాకు సంబంధించిన అంశాలపై ఇరువురూ చర్చించారు.

స్థలం కొట్టు.. బడ్డీ పెట్టు

- రాజాంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్న వైనం
- కబ్జారాయుళ్లపై కానరాని చర్యలు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం



సబ్ రిజిస్ట్రార్ అవుట్‌గేట్‌ను మూసేసి ఏర్పాటు చేసిన బడ్డీ

రాజాం రూరల్, జూన్ 28: రాజాంలో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండాపోతుంది. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, వాగులు, బస్టాండ్లు, సాగునీటి కాలువలు ఇలా దేన్నీ ఆక్రమణదారులు వదలడం లేదు. ప్రతిదీ ఆక్రమణకు గురవుతుంది. ముందురోజు ఖాళీగా కనిపించే స్థలాల్లో మరుసటిరోజు బడ్డీలు, దుకాణాలు వెలుస్తున్నాయి. వీటిని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ నడిబొడున ఉన్న లక్షలాది రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకోవడం లేదు.


ఆక్రమణలు ఇలా..

● రాజాం అంబేడ్కర్ కూడలి నుంచి డోలపేటకు వెళ్లే రోడ్‌లో జేజే ఇనోటెల్ హోటల్‌కు అనుకుని ఉన్న సాగునీటి కాలువను ఓ వ్యాపారి ఆక్రమించి బడ్డీ ఏర్పాటు చేశాడు. బహిరంగ మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. ఇదే వ్యాపారి బడ్డీకి ఎదురుగా ఉన్న ఖాళీస్థలాన్ని సైతం ఆక్రమించి గోడ కట్టాడు. షాపింగ్ బాగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో దీని విలువ కూడా సుమారు రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. ● ఇదే మార్గంలోని మరో మూడు సాగునీటి కాలువలు కూడా ఆక్రమణకు గురయ్యాయి. ప్రస్తుతం బస్టాండ్ ఉన్న ప్రాంతంలో 43.77 ఎకరాల విస్తీర్ణంలో గుర్రమ్మ, మల్లమ్మ చెరువులు ఉండేవి. గతంలో ఈ చెరువులకు మూడు సాగునీటి కాలువల ద్వారా నీరు అందేది. వీటి కింద వందల ఎకరాల ఆయకట్టు ఉండేది. కాలక్రమంలో ఆయకట్టు ప్రాంతంలో ఈశ్వరనారాయణ కాలనీ, బాబానగర్ కాలనీ ఏర్పాటు కావడంతో ఆ మూడు కాలువలు కబ్జాకు గురయ్యాయి. ● పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆవరణ పూర్తిగా ఆక్రమణకు గురైంది. సుమారు 20 మంది ఆక్రమించి బడ్డీలు పెట్టారు. కొంతమంది ఆక్రమణదారులు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ బడ్డీలను అద్దెలకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గతంలో రెండు మార్గాలు ఉండేవి. వీటిలో మాధవబజార్‌లోని గేటును ఆక్రమించి బడ్డీ ఏర్పాటు చేశాడు ఓ వ్యక్తి. ఈ బడ్డీని నెలకు రూ.25 వేలకు అద్దెకు ఇచ్చాడు. ఇదే ప్రాంగణంలోని మెయిన్ రోడ్ సైతం ఆక్రమణకు గురైంది. ఇక్కడ కూడా దుకాణాలు వెలిశాయి. ● మెయిన్ రోడ్‌లోని ఆర్అండ్‌బీ కార్యాలయం శిథిలం కావడంతో అక్కడ ఓ వ్యక్తి హోటల్ నిర్వహిస్తున్నాడు. మిగిలిన ప్రదేశంలో బడ్డీలు ఏర్పాటయ్యాయి. ● సామాజిక హాస్పిటల్ లోపలి నుంచి బజార్‌లోకి వెళ్లేందుకు సుమారు పది అడుగుల వెడల్పుతో ప్రధాన మార్గం ఉండేది. ఈ మార్గాన్ని మూసేసి షాప్ నిర్మాణం చేపట్టారు. దీని విలువ హీనపక్షంగా రూ.50 లక్షలు పైమాటే. ప్రస్తుతం నెలకు రూ.20 వేలకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ● మున్సిపాలిటీకి చెందిన బస్టాండ్ ఆవరణ సైతం ఆక్రమణకు గురైంది. లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలంలో బడ్డీలను ఏర్పాటు చేసుకున్నారు. ఇదే ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో కొందరు అద్దెలు చెల్లిస్తూ వ్యాపారాలు చేస్తుంటే ఆక్రమణదారులు పట్టుమని పది రూపాయలు కూడా చెల్లించడం లేదు. దీంతో అద్దెలు చెల్లించేవారంతా ఈసురోమంటున్నారు. ● ఎన్టీఆర్ కాంప్లెక్స్ సైతం ఆక్రమణదారుల గుప్పెట చేరింది. లీజుదారులు నెలనెలా వేలాది రూపాయల అద్దెలు చెల్లిస్తుంటే అందుకు విరుద్ధంగా గత ప్రభుత్వ హయాంలో కొంతమంది బడ్డీలు పెట్టి ఆక్రమించారు. దీంతో లీజుదారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. కాగా, రాజాంలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు అడుగులు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ కార్యాలయాలను ఆక్రమించినా నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా అధికారులు రంగంలోకి దిగాలని స్థానికులు కోరుతున్నారు.



పశుసంవర్ధక కార్యాలయ ప్రాంగణాన్ని ఆక్రమించి పెట్టిన బడ్డీలు

ఎవరికి దక్కుతాయో?



- నామినేటెడ్ పదవులపై టీడీపీ నేతల దృష్టి
- ఆరు నెలల్లో సహకార సంఘాల ఎన్నికలు
- నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో డీసీసీబీ, డీసీఎంఎస్, సాగునీటి సంఘాలు వంటి పదవులతో పాటు నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ నాయకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాజాగా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల పదవులను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. పీఏసీఎస్‌ల చైర్మన్ల స్థానంలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించే అధికారాన్ని జిల్లా కోపరేటివ్ అధికారికి కట్టబెడుతూ ప్రభుత్వం శుక్రవారం జీవోను విడుదల చేసింది. దీంతో సహకార సంఘాల (పీఏసీఎస్)లకు కూడా పర్సన్ ఇన్‌చార్జిలు రానున్నారు. అయితే సహకార సంఘాల అధికారులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నట్లు సమాచారం. డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు ఇప్పటికే జేసీని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలిసిందే.

మొదటిగా సహకార సంఘాల ఎన్నికలే?

కూటమి ప్రభుత్వంలో మొదటిగా సహకార సంఘాల ఎన్నికలే జరగనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటికే దీనిపై దృష్టి పెట్టింది. పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ఆరు నెలలు. దీనికంటే ముందే ఎన్నికల నిర్వహించి కొత్త బాడీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. పీఏసీఎస్ అధ్యక్షులు అంతా కలిసి డీసీసీబీ డైరెక్టర్లను ఎన్నుకుంటారు. డైరెక్టర్లు అధ్యక్షుడ్ని, సభ్యులను ఎన్నుకునే విధంగా ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీంతో ఇన్నాళ్లుగా పార్టీ కోసం పనిచేసిన నాయకులకు పదవులు దక్కనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 92 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించే దిశగా ప్రయత్నం సాగుతోంది. అలాగే సాగునీటి సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడం ద్వారా మరికొందరికి పదవులు రానున్నాయి. సాగునీటి సంఘాల విధానాన్ని టీడీపీ ప్రభుత్వమే గతంలో తీసుకు వచ్చింది. మళ్లీ ఆ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే, అనేక నామినేటెడ్ పదవులు ఉన్నాయి. ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇలా అనేకం ఉన్నాయి. వీటిపై కూడా దృష్టి పెట్టాల్సి ఉంది. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి వారికి నామినేటెడ్ పదవులు అందించాలని టీడీపీ నేతలు కోరుతున్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

● జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామానందం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రామానందం

నెల్లిమర్ల: రానున్న విద్యా సంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా గిరిజన సంక్షేమ, ప్రాధికార అధికారి బోని రామానందం సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను తనిఖీచేశారు. స్టోర్‌లో సరుకుల నిల్వలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు కర్రి సూర్యనారాయణతో పాటు ఉపాధ్యాయులతో సమావేశమై పలు విషయాలను చర్చించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిపై ఆరా తీసి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇంతవరకు 90 మంది కొత్త విద్యార్థులు చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

సుజల స్రవంతితోనే వలసల నివారణ

● మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు



మాట్లాడుతున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: పోలవరం ప్రాజక్టు పూర్తయి, సుజల స్రవంతి నీరు వస్తేనే ఉత్తరాంధ్ర జిల్లాల్లో వలసల నివారణ సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన చీపురుపల్లిలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వాలు పోలవరం ప్రాజక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలవరం ప్రాజక్టు ఎత్తు కూడా 45.72 అడుగులకు తగ్గకుండా కేంద్రం, రాష్ట్రం అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తరాంధ్రలోని పాత జిల్లాల్లో దాదాపు ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దెబ్బతిన్న డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాం పనుల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దీన్ని జాతీయ ప్రాజక్టుగా గుర్తించి, పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. నేటి వరకూ రాజధాని లేని మన రాష్ట్రంలో అమరావతి పునర్నిర్మాణంపై చంద్రబాబు దృష్టి పెట్టారన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని డీసీసీబీ, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లకు పూర్తి స్థాయిలో చైర్మన్ల నియామకాలను తక్షణమే పూర్తి చేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

నెల్లిమర్ల: గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువలు, తాగునీటి బోర్లు వద్ద శుభ్రం చేయాలని అన్నారు. పారిశుధ్య పనులు విరివిగా చేపట్టి గ్రామాలను పూర్తి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వఉండకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఇంటింటా జ్వర పీడితులను గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

విత్తనాల షాపుల తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న సహాయ సంచాలకుడు మహరాజన్

దత్తిరాజేరు: మండలంలోని కనకదుర్గా ట్రేడర్స్, కొల్లా నరసింహస్వామి అండ్ సన్స్ విత్తనాల షాపును వ్యవసాయ సహాయ సంచాలకుడు మహరాజన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులోని విత్తనాలు, ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్లు విధిగా ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇవ్వాలన్నారు. దీనిలో భాగంగా విత్తనాల నమూనాలను సేకరించి విత్తన పరీక్షా కేంద్రానికి పంపించాలని మండల వ్యవసాయాధికారి అనూరాధకు ఆదేశించారు. విత్తనాల రేట్లను, వివరాలను బయట బోర్డులో పెట్టాలని సూచించారు. మొలక శాతం కట్టిన తర్వాత మాత్రమే నారు పోసుకోవాలని, విత్తనశుద్ధి తప్పనిసరి అని సూచించారు.

జేఎస్ఎల్ కర్మాగారాన్ని తెరిపించండి



రిలే దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

కొత్తవలస: జేఎస్ఎల్ కర్మాగారాన్ని వెంటనే తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలని శుక్రవారం కర్మాగారం ఆవరణలో కార్మికులు నినాదాలు చేశారు. కర్మాగారాన్ని యాజమాన్యం మూసేసి 43 రోజులైందని... కార్మికులు ఆకలి మంటలతో అలమటిస్తున్నారని... యాజమాన్యం అక్రమ లాకౌట్‌ను ఎత్తేయాలని నినాదాలు చేశారు. కార్మికుల నిరసన కార్యక్రమాలు యాజమాన్యానికి తలనొప్పిగా మారడంతో పాటు ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కార్మికులు శుక్రవారం యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మొండి వైఖరిని విడనాడి కార్మికులకు న్యాయం చేసే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో వైద్య శిబిరం

దత్తిరాజేరు: మండలంలోని కోరపుకొత్తవలస పీహెచ్‌సీ పరిధిలోని ఎస్టీ కొత్తవలస, పాపయ్యవలస గ్రామాల్లో డాక్టర్ పి.స్రవంతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలను గుర్తించి చికిత్సలు అందజేశారు. 32 మందికి మలేరియా రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల లక్షణాలు వచ్చిన పక్షంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డీవీ గిరిబాబు, ఎంపీహెచ్‌యూ బి.మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

లక్కవరపుకోట: రైతులు, మహిళా మండలి సభ్యులు తీసుకున్న రుణాలు బ్యాంకులకు సకాలంలో చెల్లించి ప్రభుత్వ రాయితీలను పొందాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఏపీజీవీబీ మేనేజర్ సోమేశ్‌తో కలసి రేగ గ్రామంలో సీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సీనియర్ ఖాతాదారుడు రావాడ ఈశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్పీ బొడ్డు సత్యనారాయణ, రావాడ నీలకంఠం, ఎడ్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భోజనం తయారీలో రాజీ వద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

జామి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం తయారీలో నిర్వాహకులు రాజీ పడొద్దని, నాణ్యమైన ఆహారం అందించాలని మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు సూచించారు. శుక్రవారం ఆయన పాతభీమసింగిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వేపాడ: బొద్దాం గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి చలుమూరి పద్మ పర్యవేక్షణలో పనులు చేపడుతున్నారు.

ఇదేనా పాఠశాలల బలోపేతం?

● అదనపు తరగతి గదులకు నోచుకోని భీమసింగి ప్రాథమికోన్నత పాఠశాల

● వైసీపీ హయాంలో వర్గ విభేదాలే కారణం

● అవస్థలు పడుతున్న విద్యార్థులు



పాఠశాల వరండాలో బోధిస్తున్న దృశ్యం



పాఠశాలను ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం

జామి: భీమసింగి ప్రాథమికోన్నత పాఠశాల నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో వర్గ విభేదాల కారణంగా అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. ఒకప్పుడు ఎంతో మంచి పేరున్న ఈ పాఠశాలలో సుమారు 200మందికి పైగా విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించేస్తున్నారు. నాడు-నేడు అని చెప్పి ఇలాగేనా పాఠశాలలను బలోపేతం చేసేది అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఉన్న ప్రధాన సమస్య అదనపు తరగతి గదులు లేకపోవడమే. ఈ సమస్య తీరితే ప్రస్తుతం 137మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 200 దాటుతుందనడంలో సందేహం లేదు. ఈక్రమంలో ఉపాధ్యాయులు అదనపు గదుల ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. అదే సమయంలో 2019 సార్వత్రిక ఎన్నికలు మొదలు కావడంతో అదనపు భవనాల ప్రస్తావన ఆగిపోయింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని పెద్ద డబ్బా కొట్టింది. అందరూ నిజమే అనుకున్నారు. ఇదే సమయంలో పంచాయతీ ఎన్నికలు జరగడం వైసీపీ రెండు వర్గాలుగా చీలిపోయింది. అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నవారు గెలిచారు. అయితే గెలిచిన సర్పంచ్ పాఠశాలను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో అదనపు భవనాలు నిర్మిద్దామని తీర్మానంచేశారు. అయితే మరో వర్గం మాత్రం ఈ అదనపు భవనాలను గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిల్లపాలెంలో నిర్మించాలని పట్టుబట్టింది. దీంతో పాఠశాల అదనపు భవనాల నిర్మాణం ఆటకెక్కింది. దీంతో గదులు చాలక వరండాలోనే బోధించాల్సి వచ్చింది. ఇది చూసిన తల్లిదండ్రులు తమ పిల్లలను వేరే పాఠశాలకు పంపించడం ప్రారంభించారు. అరకొర వసతితో ప్రస్తుతం విద్యాబోధన సాగుతోంది.

వైసీపీలో ఉన్న రెండు వర్గాల విభేదాల కారణంగా విద్యార్థులకు శాపంగా మారి ఇబ్బందులు పాలుచేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యను తీర్చాలని పాఠశాల వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో అదనపు భవనాలను నిర్మించడంతో పాటు పాఠశాలను పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయాలని గ్రామ యువత కోరుతున్నారు. తమ గ్రామ వైసీపీ నాయకుల తీరుతో విద్యార్థులకు ఇక్కట్లు రావడం బాధాకరం అని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

● నెల్లిమర్లలో ఈవీఎం గోదాముల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని ఈవీఎం గోదాములను నూతన కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. సీసీ కెమేరాలు, గొడౌన్‌లకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈవీఎం గోదాములకు ఇరువైపులా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. ఇరువైపులా చెరువుల్లా మారిన పల్లపు ప్రదేశాలను పరిశీలించారు. ఆ నీరు బయటకు పోయే మార్గాలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాలను మట్టితో కప్పివేయాలని, నీరు పోవడానికి పైప్‌లైన్ వేయాలని, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. దీనిపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అనిత, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, ఇరిగేషన్ ఈఈ ఎం.సీతారామ్‌నాయుడు, నగర పంచాయతీ కమిషనర్ బాలాజీప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకర్, తహసీల్దార్ డి.ధర్మరాజు, డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, రాజారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాగమాధవికి ఘన సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న రవిశేఖర్, ఆనంద్‌కుమార్ తదితరులు

నెల్లిమర్ల: ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టి, తొలిసారిగా మండలానికి వచ్చిన లోకం నాగమాధవికి వల్లూరు గ్రామంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ ఆమెను గజమాలతో సత్కరించారు. అలాగే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజును కూడా సత్కరించారు. ఈసందర్భంగా రవిశేఖర్ మాట్లాడుతూ నాగమాధవి హయాంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గేదెల రాజారావు, బూర్లె శ్రీధర్, పంచాది సూరినాయుడు, లెంక సన్యాసిరావు, పంచాది జగన్నాథం, ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

నెల్లిమర్ల: వల్లూరు గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే నాగమాధవి రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు వీటీ రామారావు, పూర్ణిమ, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని తొలగిస్తే సహించేది లేదు



మర్రివలస వద్ద నిరసన తెలియజేస్తున్న గ్రామస్థులు

గజపతినగరం: గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా మర్రివలస గ్రామం వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయాన్ని తొలగిస్తే సహించేది లేదని గ్రామస్థులు హెచ్చరించారు. శుక్రవారం వారంతా రోడ్డు పైకి వచ్చి నిరసన తెలిపారు. ఏన్నో ఏళ్లగా ఉన్న ఆలయంతో పాటు గ్రామానికి వచ్చి పోయే రోడ్డును మూసివేస్తామని అధికారులు చెప్పడం బాధాకరమన్నారు. ప్రత్యామ్నాయ మార్గం చూపిన తరువాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్జున్, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● బొబ్బిలి ఆర్డీవో మురళీకృష్ణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

మెంటాడ: మండలంలోని ఆంద్ర, లోతుగడ్డ, చల్లపేట గ్రామాల్లో బొబ్బిలి ఆర్డీవో మురళీకృష్ణ శుక్రవారం పర్యటించారు. ఈ సీజన్‌లో డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈసందర్భంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల మురికివాడలను పరిశీలించారు. తాగునీటి ట్యాంకులను కూడా పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ లోకప్రియ, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వన సంరక్షణ మన బాధ్యత

● జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేష్



పశువుల కాపర్లకు సూచనలు ఇస్తున్న వెంకటేష్

నెల్లిమర్ల: వన సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖాధికారి వెంకటేష్ అన్నారు. కొత్తపేట గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. అటవీ అధికారుల ఆధ్వర్యంలో సుమారు 20 హెక్టార్ల విస్తీర్ణంలో 15వేల మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను పశువులు, గొర్రెలు కారణంగా ధ్వంసం కాకుండా చూడాలని, సిబ్బంది పరిరక్షణ చర్యలను చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజి అధికారి బి.అప్పలరాజు, డివిజినల్ రేంజ్ అధికారి కేవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దత్తిరాజేరు: రాజులరామచంద్రపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠ శాలల్లో చేరేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. హెచ్ఎం జి.కృష్ణవేణి ధన్యవాదాలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు బీసీ వసతి గృహల్లో సీట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రెండేళ్లుగా పాఠ్య పుస్తకాలు అందక ప్రైవేటుగా కొనుగోలు చేసుకోవలసి వస్తోందని తెలిపారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంతో పాటు పుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లాకు అభినందన



పల్లాను అభినందిస్తున్న కోళ్ల దంపతులు

శృంగవరపుకోట: అమరావతి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అభినందించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరామప్రసాద్‌తో కలిసి వెళ్లిన ఆమె నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

హమాలీ చార్జీలను అందించండి

జామి: జామి, అన్నంరాజుపేట పీఏసీఎస్‌లలో 2021వ ఏడాదికి సంబంధించి రైతులకు చెల్లించాల్సినహమాలీ చార్జీలను ఇంకా ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండారు పెదబాబు అన్నారు. దీనిపై డీసీవో రమేష్ కుమార్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నాయకుల తీరుతో రైతులకు అందాల్సిన రూ.22 లక్షలు పక్కదారి పట్టినట్లు తమకు అనుమానంగా ఉందని.. దీనిపై దర్యాప్తు చేయించాలని కోరామన్నారు. దీనిపై డీసీవో సానుకూలంగా స్పందించారని తెలిపారు.

క్లుప్తంగా..

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

నెల్లిమర్ల: ఎంజేపీ ఏపీ బీసీ బాలబాలికల గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల భర్తీకి ఇటీవల నిర్వహించిన పరీక్షల ఫలితాలు, ర్యాంకులు శుక్రవారం విడుదల అయ్యాయని ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ సీహెచ్ రమామోహిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు, ర్యాంకులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఆమె చెప్పారు. సీట్ల భర్తీ కోసం వచ్చే నెల 2, 3 తేదీల్లో జరుగనున్న కౌన్సెలింగ్‌కు విద్యార్థులను 1:2 నిష్పత్తిలో పిలుస్తామని, అర్హులైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని ఆమె తెలిపారు. జూలై 2న బాలురకు, 3న బాలికలకు కౌన్సిలింగ్ ఉంటుందని ఆమె తెలిపారు.

దోమ తెరల పంపిణీ

గుర్ల: భూపాలపురంలో శుక్రవారం కాకినాడ నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ ఏజీఎం పి.సుబ్రహ్మణ్యం 400 దోమ తెరలు పంపిణీ చేశారు. ఆ సంస్థ జిల్లా ప్రతినిధి రాహుల్, టీడీపీ నాయకుడు సీర సత్యం మాస్టారు, కంపెనీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆశీలు వేలం పాట వాయిదా

గజపతినగరం: స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించి ఆశీలు వేలం పాట వాయిదా పడింది. సర్పంచ్ నరవ కొండమ్మ, ఈఓపీఆర్‌డీ జనార్దనరావు సమక్షంలో శుక్రవారం ఆశీలు వేలంపాట నిర్వహించారు. రూ.63 వేలు మాత్రమే పాట పలుకగా.. ఈనెల 3వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. పురిటిపెంట పంచాయితీకి సంబంధించి శనివారం ఆశీలువేలం వేయనున్నట్లు ఈవో జనార్దనరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

గంట్యాడ: గత నెలలో జరిగిన అంతర్ రాష్ట్ర రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపించారు. తిమ్మాపురంలోని వరల్డ్ వన్ స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.అక్షయ, అశ్విని, రాధిక, పదో తరగతి చదువుతున్న విజయ, నవత్ జశ్విని, హాసిని మంచి ప్రతిభ చూపి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎస్‌వో అల్లు జ్యోతి, పీఈటీ భవాని అభినందించారు.

పండుగలా పింఛన్ల పంపిణీ చేయాలి

లక్కవరపుకోట: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెంచిన సామాజిక పింఛన్లను జూలై 1వ తేదీన పండగవాతావరణం తల పించేలా పింఛనుదారులకు పంపిణీ చేయాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. సచివాలయ సిబ్బందికి టీడీపీ నేతలు, కార్యకర్తలు సహకరించి చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడని ప్రతి పింఛనుదారుడికి తెలియజేయాలన్నారు. మండల స్థాయి నుంచి క్లస్టర్, గ్రామ, వార్డుల నేతలు, కార్యకర్తలు పింఛను పంపిణీలో పాల్గొని పేదలందరికీ అందజేయాలని ఆమె కోరారు. ఏ ఒక్క పింఛను దారుడికి సొమ్ము అందలేదనే అపవాదు రాకుండా కార్యకర్తలు, నేతలు చూసుకోవాలని ఆమె తెలియజేశారు.

1న ఐటీఐలో మెగా జాబ్‌మేళా

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 1న ఉదయం 9.30 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్టు ప్రిన్సిపాల్ టీవీ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఐటీఐలో ఏ ట్రేడ్ పాసైన వారైనా, ఇంటర్, డిప్లమో, డిగ్రీ అర్హతలు ఉన్నవారు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవ చ్చునని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, టీవీఎస్, సుందరం ఫాస్టనర్స్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్, క్యూసీవ్ టెక్నాలజీ, వరుణ్ జేసీబీ, టీసీఎస్, వరుణ్‌మోటార్స్, టెక్ మ హీంద్రా తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు రెండో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఎస్ఎస్‌సి పాసైన అభ్యర్థులు ఈ నెల 29 నుంచి వచ్చేనెల 24లోగా రిజిస్ట్రేషన్ చేసుకొని యూనిక్ నెంబరును పొందాలని ఆయన సూచించారు. బొబ్బిలి ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్టు, మోటారు మెకానిక్, వెహికల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడులలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం ఐటీఐలలో ఎక్కడైనా ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వచ్చే నెల 27న బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించబోయే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణారావు సూచించారు.

రేపు రాజాం రచయితల వేదిక సమావేశం

రాజాం: రాజాం రచయితల వేదిక 113వ సమావేశం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈనెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని నిర్వాహకుడు గార రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో శ్రీనాథ సాహిత్య విహంగ వీక్షణం అనే అంశంపై సాహితీ వేత్త నేతేటి గణేశ్వరరావు ముఖ్య ప్రసంగం చేస్తారన్నారు.

అందరూ అందుబాటులో ఉండాలి

రాజాం: జూలై 1వతేదీ నుంచి పింఛన్ల పంపిణీ చేపడుతున్నందున పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్షించారు. క్లస్టర్ల వారీగా మ్యాప్‌చేసిన సచివాలయ సిబ్బంది 1న ఉదయం 6 గంటల నుంచి ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మున్సిపల్, మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. ఈ మేరకు నూతన ఎమ్మెల్యే బేబీనాయనకు, గౌరవసభ్యులందరికీ ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

● బొబ్బిలి మండల పరిషత్ సర్వసభ్యసమావేశం శనివారం ఉదయం ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

విజయనగరం క్రైం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ కోరాడ రామారావు హెచ్చరించారు. గురువారం రాత్రి కొత్తపేట, లంకా పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి రోడ్డుపై సంచరిస్తున్న వారిని హెచ్చరించి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూటౌన్ పరిధిలో రోజూ విస్తృతంగా తనిఖీలు చేపడతామని, మద్యం తాగి పట్టుబడినా, అల్లర్లకు పాల్పడినా, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ భవనంలో తరగతులు వద్దు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుభవనంలో కార్పొరేట్ కళాశాలను నిర్వహిస్తుండడంపై ఎస్ఎఫ్ఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన నిర్వహించింది. శుక్రవారం కళాశాలను పరిశీలించిన అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు కిరణ్, మణికుమార్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వసతులు కల్పించకుండానే ఇంటర్ తరగతులు నిర్వహించడం సరికాదన్నారు. అధికారులు ఎలా అనుమతి ఇచ్చారు? అడ్మిషన్లు ఎలా జరిపించారు? అని ప్రశ్నించారు. దీనిపై ఆర్ఐఓ కు ఎస్ఎఫ్ఐ తరపున ఫిర్యాదు చేశామన్నారు. అధికారుల తీరుకు నిరసనగా నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, సాయిమణి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్

రాజాం: రాజాం రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి రేగిడి దగ్గర ఉన్న పంప్‌హౌస్ వద్ద కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్టు పురపాలక సంఘ ఏఈ వెంకటరామరాజు తెలిపారు. గురువారం ఈదురుగాలులకు హెచ్‌టీ లైన్ తెగిపోవడంతో రాజాం పట్టణంలో కొన్ని ప్రాంతాలకు శుక్రవారం తాగునీరు అందించలేకపోయామన్నారు. హెచ్‌టీ లైన్‌ను, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో శనివారం నుంచి అన్ని వార్డులకు పూర్తి స్థాయిలో కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

నేడు కొత్తవలస కోర్టులో లోక్ అదాలత్

కొత్తవలస : కొత్తవలస కోర్టులో శనివారం ఉదయం 10 గంటల నుంచి మెగా లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి డాక్టర్ ఎస్.విజయచందర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ పోలీసు స్టేషన్ పరిధిలో గల కేసులతో పాటు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులను రాజీ చేయనున్నట్టు తెలిపారు.

ఖాళీ స్థలం ఉంటే.. కబ్జాయే

● వైసీపీ నేతల ఆగడాలు

● అడ్డుకట్ట వేయాలని కోరుతున్న ప్రజలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు చేసిన ఆక్రమణలు, అక్రమాలు ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. అధికార బలం, రెవెన్యూ యంత్రాంగం అండదండలతో దందాలకు తెరలేపారు. ఖాళీ జాగా కనబడితే చాలు ఆ స్థలం వారి చేతుల్లోకి రావలసిందే. వెంటనే బినామీలను రంగంలోకి దించేస్తారు. వారికి అనుకూలంగా ఉండే స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని రంగంలోకి దించి రికార్డులు తారుమారు చెయ్యగలిగిన ఘనులు వైసీపీ నేతలు. ఇలాంటి ఘటనలు జిల్లాలో అనేక చోట్ల చోటు చేసుకున్నాయి. ఎదురు తిరిగిన వారిపై బెదిరింపులు, భౌతిక దాడులకు తెగబడిన ఘటనలు కోకొల్లలు. ● డెంకాడ మండలం గుణుపూరుపేట వద్ద గల ఆనందరాజు చెరువులోని సుమారు 15 ఎకరాల వరకు ఓ వైసీపీ నేత కుటుంబంతో సహా మరో 18 మంది పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. టీడీపీ ప్రభుత్వం రాకతో గ్రామస్థులు కబ్జాను అడ్డుకున్నారు. దీనిపై ఆర్డీడీ, ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కబ్జా స్థలం విలువ సుమారు రూ.50 కోట్లపైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. విచారణ అనంతరం అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు.

● విజయనగరం రాజీవ్ నగర్ కాలనీ మొదటి లైన్‌కు ఆనుకుని ఉన్న మాన్సాస్ భూములను ఆక్రమించి వైసీపీ కీలక నేతకు చెందిన వ్యక్తి వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. నీరు వెళ్లేందుకు వీలుగా కాలనీ వైపు కాలువను తవ్వేశారు. దీంతో వర్షం వస్తే ఇళ్లల్లోకి మురుగు నీరు చేరుతోంది. ఈ విషయమై గతంలో ప్రశ్నిస్తే కబ్జాదారులు దాడులకు పాల్పడ్డారని బాధితులు చెబుతున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ.5 కోట్లు ఉంటుందని అంచనా.

● కేఎల్‌పురం వద్ద గల సర్వే నెంబరు 30/20లోని జర్నలిస్టు కాలనీలో మిగిలిన స్థలాన్ని ఓ వైసీపీ ప్రజా ప్రతినిధి ఆక్రమించి, తమవారికి అంటగట్టాడు. ఎమ్మెల్యేల వద్ద పనిచేసిన వారికి కొంతమందికి పంచేశాడు. దీనిపై విచారణ చేపట్టాలని గతంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీవో సూర్యకళకు తెలిపినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ప్రభుత్వాలు మారినా వైసీపీ నేతల సేవలోనే రెవెన్యూ యంత్రాంగం పని చేస్తోందన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు.

● **గ్రామకంఠం కబ్జా**

తాజాగా పినవేమలిలో ఓ ప్రజాప్రతినిధి గ్రామానికి చెందిన గోర్జిని ఆక్రమించి కబ్జాచేసిన వైనం వెలుగులోకి వచ్చింది. పొట్నూరు గోర్జిగా పిలవబడే గ్రామకంఠంలోని సుమారు 40 లింకుల స్థలాన్ని మట్టితో నింపేశారు. వెంటనే ఆ స్థలాన్ని 8 భాగాలు బిట్‌లుగా చేసి అమ్మేశాడు. దీంతో ఆ గోర్జి వెంట వెళ్లే నాటు బళ్లకు, వర్షపు నీరు వెళ్లేందుకు తోవలేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పినవేమలి గ్రామంలో కబ్జాకు గురైన గోర్జి స్థలంలో వెలసిన కళ్లాలు

గతంలో ఇదేంటని ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడ్డారని, రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అదే గ్రామంలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఉంటున్న పేద కుటుంబాన్ని బెదిరించి, ఇంకో చోట స్థలం ఇస్తామని చెప్పి అక్కడి నుంచి తరిమేశారు. తదనంతరం రియల్ వెంచర్‌కు అనువుగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని చూశారు. ఆ కుటుంబం మళ్లీ అక్కడే ఓ గుడిసె వేసుకోగా రాత్రికి రాత్రే తగులబెట్టారు. ఇదీ ఆ వైసీపీ నేత పనేనని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇలా వైసీపీ నేతల భూ కబ్జాలకు, బెదిరింపులకు అడ్డూ అదుపూ లేకుండా ఉందని, వీరి అరాచకాలకు కొంతమంది రెవెన్యూ అధికారులు వత్తాసు పలకటంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అదితి, కలెక్టర్ అంబేడ్కర్ స్పందించి తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తీరిన వరదనీటి సమస్య

● స్పందించిన ఎమ్మెల్యే అదితి

● సోషల్ మీడియాలో ట్యాగ్ చేయడంతో ఒక్కరోజులో పరిష్కారం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జూన్ 28: విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు పరిపాలనలో దూకుడు పెంచారు. సోషల్ మీడియాలో ట్యాగ్ చేసిన సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించి అభినందనలు అందుకున్నారు. నగరంలో గడిచిన రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా నగరం నుంచి వైఎస్ఆర్ కాలనీకి వెళ్లే మార్గంలోని, రైల్వే బ్రిడ్జి వద్ద కాలువలు, డ్రైనేజీ పైపులైన్‌లో వ్యర్థాలు, పూడిక పేరుకుపోవటంతో ఆ మార్గమంతా వరదనీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. రెండేళ్లనుంచి ఉన్న గత పాలకులు, అధికారులు పట్టించుకోక పోవటంతో ఈ సమస్య మరింత జటిలమైంది. గురువారం కురిసిన వర్షానికి పెద్దఎత్తున నీరు చేరుకోవటంతో స్కూల్ విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఆ మార్గం గుండా వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్థానిక రమేష్ అనే యువకుడు సమస్యను ప్రస్తావిస్తూ ఫొటోలతో సహా ఎమ్మెల్యే అదితికి వాట్సాప్ ద్వారా సమస్యను వివరించారు. సమస్యపై స్పందించిన ఆమె ఉదయాన్నే నగరపాలక సంస్థ అధికారులను అలెర్ట్ చేసి, యుద్ధ ప్రాతిపాదికన సమస్యను పరిష్కారించాలని ఆదేశించటంతో ఒక్క పూటలో కాలువల్లో పూడిక తీత, పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించి మురుగునీటిని తరలించారు. దీంతో పరిపాలనలో అదితి దూకుడుకు స్థానిక విద్యార్థినులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



గురువారం చెరువులా మారిన వైఎస్ఆర్ నగర్ రోడ్డు



శుక్రవారం జేసీబీలతో పూడిక తీస్తున్న దృశ్యం

భార్యపై హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

బాడంగి, జూన్ 28: భార్యను వేధించిన కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు, జరిమానా విధించినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గజరాయనివలస గ్రామానికి చెందిన గొండేల సూరిబాబు భార్యను వేధిస్తూ 2021 సంవత్సరం జూలై 6న ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఈ మేరకు అప్పట్లో ఎస్ఐ ఎ.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. కాగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో బొబ్బిలి సబ్ జడ్జి ఎస్.అరుణశ్రీ నిందితుడికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా, హత్యాయత్నం చేసినందుకు రూ.10వేల జరిమానా 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధించినట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు రెండు శిక్షలను ఏకకాలం అమలు చేసేలా తీర్పునిచ్చినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విజయ్‌కుమార్ మృతదేహం

నెల్లిమర్ల, జూన్ 28: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన బోనుమహంతి విజయ్‌కుమార్(28) ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఓ ఇంటికి వెళ్లి మేడపైన ఉండగా ఇంటిపైనుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లు విజయ్‌కుమార్‌కు తగలడంతో ఆయన వెంటనే కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు, కుటుంబీకులు విజయనగరం సర్వజన ఆసుపత్రికి తీసుకువెళ్లినప్పటికి ప్రయోజనం లేకపోయింది. విజయ్‌కుమార్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి అప్పలనర్సయ్య ఫిర్యాదు మేరకు నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయన గరం సర్వజన ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్న వారికి జరిమానా



బొబ్బిలిలో షాపులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

బొబ్బిలి, జూన్ 28: బొబ్బిలి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ గ్లాసులు విక్రయిస్తున్న షాపులపై మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు జరిపి షాపుల యజమానులకు జరిమానా విధించారు. కమిషనరు లాలం రామలక్ష్మి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారు. మొత్తం 15 షాపులను తనిఖీ చేసి 8 వేల రూపాయల అపరాధ రుసుం విధించారు. హోల్‌సేల్ షాపులకు రెండువేలు, చిన్న షాపులకు 500 రూపాయల చొప్పున జరిమానా విధించి ప్లాస్టిక్ గ్లాసులను, ఇతర సామగ్రిని సీజ్ చేశారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ విక్రయాలపై నిషేధం ఉన్నందున ప్లాస్టిక్ విక్రయాలు జరపరాదని షాపుల యజమానులను అధికారులు హెచ్చరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీజీఈఏ ఉద్యోగులు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు

కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయా సంఘ నాయకులు శుక్రవారం సాయంత్రం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలోని సంఘ నాయకులు బాలభాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భూషణరావు, ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, వెంటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

రేగిడి: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఉణుకూరు శ్రీ లక్ష్మీగణపతి ట్రేడర్స్, శ్రీరామ ట్రేడర్స్, జోడిబందల, బూరాడ సెంటర్లలో షాపులను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలి గించినా షాపుల యాజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ● **బాడంగి:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి కే.శిరీష శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాల కలిగినవి మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయించినా, నాణ్యతాప్రమాణాలు పాటించకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. వరి, మొక్కజొన్న విత్తనాలను తీసి విత్తన పరీక్షా కేంద్రానికి తరలించారు. రికార్డులు, ధరల పట్టిక తప్పనిసరిగా నిర్వహించాలన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు: పట్టణంలోని రింగురోడ్డు పరిధిలోగల రాజీవ్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న మాన్సాస్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని నగర పాలక సంస్థ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. మాన్సాస్ ట్రస్ట్ డిప్యూటీ కమిషనర్ అండ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాన్ని తొలగించినట్లు నగర పాలక సంస్థ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఫిలిప్ తెలిపారు.

క్రిమినల్ చట్టాలను ఉపసంహరించుకోవాలి



బొబ్బిలి చర్చిసెంటరులో ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

బొబ్బిలి, జూన్ 28: భారత న్యాయసంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక చర్చి సెంటరులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఐపీసీ చట్టానికి బదులు బీఎన్ఎస్ అమలు చేస్తే అది డ్రైవర్లకు ఉరితాడు బిగించినట్లేనని ఆరోపించారు. రవాణా రంగానికి సంబంధించిన క్రిమినల్ చట్టంలో 106(1),(2) నిబంధనలు చాలా కఠినతరంగా ఉన్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎవరైనా మృతి చెందితే డ్రైవరుకు మూడు నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షపడుతుందన్నారు. వాస్తవానికి రోడ్డు ప్రమాదాలు జరగడానికి డ్రైవర్లకన్నా ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని నిపుణుల కమిటీ నిర్ధారించిందన్నారు. రహదారులన్నీ ఛిద్రమైపోవడం, ట్రాఫిక్ నిబంధనలపై సంపూర్ణమైన అవగాహన కల్పించకపోవడం, వాహనాల తయారీ కంపెనీలకు అనుగుణంగా వారి విక్రయాలను పెంచుకునేందుకు సహకరిస్తున్న ప్రభుత్వం ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారా? లేదా? అన్నది పట్టించుకోవడం లేదన్నారు. హైవే ల పక్కన మద్యం దుకాణాలు ఉండరాదన్న నిబంధన ఉన్నప్పటికీ వాటిని నిరోధించలేకపోతున్నారన్నారు. వచ్చే నెల 1 నుంచి అమలులోనికి రానున్న భారత న్యాయసంహిత చట్టాన్ని మోదీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లేకుంటే వచ్చేనెల 10 తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. చట్టం అమలైతే రవాణా రంగం సమ్మె తథ్యమన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లి కృష్ణ, మోహనరావు, రాంబాబు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పని వద్దు.. బడి ముద్దు



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వంగర: బడిఈడు పిల్లలు పనిలో చేరకుండా పాఠశాలలో ఉండాలని ఎంఈవో దుర్గారావు, హెచ్ఎం జగదీశ్వరి అన్నారు. శుక్రవారం అరసాడలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రాసింగుల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలి

● రైల్వేమంత్రిని కోరిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం: ప్రజలు నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న రైల్వే క్రాసింగుల వద్ద ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. శుక్రవారం ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రి కార్యాలయానికి వెళ్లారు. మంత్రి అందుబాటులో లేని కారణంగా అక్కడున్న ఓఎస్‌డీ వేద ప్రకాష్‌కు వినతి పత్రం అందించారు. పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే మార్గంలో ఐదు కిలోమీటర్ల దూరంలో మూడు రైల్వే క్రాసింగులున్న విషయాన్ని ఉదహరించారు. విశాఖ పోర్టు నుంచి ఒడిశా వైపు వెళుతున్న పరిశ్రమల ముడిసరకు రవాణాకు కలుగుతున్న ఇబ్బందులు ప్రస్తావించారు. ప్రతి ఐదు నిముషాలకు గేటు పడుతున్న కారణంగా ప్రయాణికులు, రవాణా వ్యవస్థ, రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

బేబీనాయనను కలిసిన టీడీపీ నాయకులు



బేబీనాయనను అభినందిస్తున్న రాష్ట్ర ఎస్సీసెల్ నేత రావాడ

బొబ్బిలి, జూన్ 28: బొబ్బిలి ఎమ్మెల్యేగా ఎన్నికై ఇటీవల అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసి వచ్చిన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)ను పలువురు కలుసుకొని అభినందనలు తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, రణస్థలం గ్రామ సర్పంచ్ రౌతు శ్రీనివాసరావు శుక్రవారం బొబ్బిలి కోటకు వచ్చి బేబీనాయనను అభినందించారు. బొబ్బిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), లంక రమేష్, పైల హరిప్రసాద్, గొల్లాది ఎంపీటీసీ పామోటి గోవింద్ తదితరులు బేబీనాయనను కలుసుకొని అభినందించారు.

ఇల్లు కూలినా పట్టించుకోలేదు



తిమిడిలో వర్షాలకు కూలిన ఇల్లు

శృంగవరపుకోట రూరల్: తిమిడి ఎస్సీ కాలనీలో మూడు రోజుల క్రితం వర్షాలకు తాము నివసిస్తున్న ఇల్లు కూలిపోయినా ఏ ఒక్కరూ చూడలేదని.. ఒకవేళ చూసినా ఎటువంటి పరిహారం అందదని వీఆర్వో చెప్పారని బాధితురాలు అక్కివరపు దేముడమ్మ వాపోయింది. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వర్షాలకు ఇల్లు కూలిపోయిందని.. తమకు గూడు కరువయిందన్నారు. ఈ విషయం వీఆర్వోకు చెబితే ప్రస్తుత వర్షాలకు ఇల్లు పడిపోతే ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని చెప్పారన్నారు. ఇలా అయితే తమ పేద కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్ కుమార్‌ను వివరణ కోరగా.. బాధితులు ప్రస్తుతం కూలిన ఇంట్లో లేరని.. పక్కన నివాసం ఉంటున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. తాము కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాక పరిహారం వచ్చే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కాలిపోతే తక్షణ సాయం ఉంటుందని.. ఇలా వర్షాలకు ఇళ్లు కూలిపోతే నివేదిక పంపించడం తప్ప పరిహారం తాము ఇవ్వలేమని చెప్పారు.

కదిలిన అధికారులు

● ముంపు సమస్య పరిష్కారంపై దృష్టి



పాఠశాల ప్రాంగణంలో సర్వశిక్షాభియాన్ ఈఈ, డీఈ తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జామి: మండల కేంద్రంలోని అల్లువీధి పాఠశాల వద్ద 'చినుకుపడితే చెరువే' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో సర్వశిక్షాభియాన్ ఈఈ శ్రీనువాస్ కుమార్ స్పందించారు. శుక్రవారం ఉదయం పాఠ శాలను సందర్శించారు. డీఈ హరిప్రసాద్, ఏఈ ఈశ్వరరావు, మండల విద్యా శాఖాధికారి జయశ్రీ, గంగరాజులతో చర్చించారు. పాఠశాల వద్ద నీరు నిల్వ ఉండకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా ఈ పాఠశాలలో మూడు ఇంకుడు గుంతలు తవ్వారని సిబ్బంది తెలి పారు. అవి ఉపయోగపడడం లేదన్నారు. 'ఆంధ్రజ్యోతి' కథనంతో సంబంధిత అధికారులు కదలి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్లుగా ఈ సమస్యను ఏ అధికారీ పట్టించుకోలేదని చెప్పారు.

సకాలంలో పింఛన్ల పంపిణీ

రాజాం రూరల్: సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. జూలై ఒకటో తేదీ నుంచి ఉదయం ఆరు గంటల నుంచే ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేయాలని స్పష్టం చేశారు. కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. క్లస్టర్ వారీగా మ్యాప్ చేసిన సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన

రాజాం రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని పొగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జి.భార్గవి స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మలేరియా నిర్మూలనపై పొగిరిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిల్వ ఉంచిన ఆహారం, చేపలు, మాంసం వంటివి తినకూడదన్నారు. వీలైనంత వరకూ వేడినీళ్లు తాగాలని డా.భార్గవి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీఈ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

రామభద్రపురం: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, వైరల్ జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాయుడువలస పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జేసీరాజు సూచించారు. శుక్రవారం పాఠశాలలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, శివున్నాయుడు, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం రూరల్: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం